# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్ధం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్ధంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్ధం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండిత్యానికి భగవత్కృప తోడైంది - వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధిక్కూడా సులభంగా అర్ధం అవుతాయి. ఆయనది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన

రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కథలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్థాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

---

# 4 వ భాగం

**గజేంద్ర మోక్షం -1**

**క. శ్రీమన్నామ! పయోద**

**శ్యామ! ధరాభృల్లలామ! జగదభిరామ!**

**రామాజనకామ! మహో**

**ద్ధామ! గుణస్తోమధామ! దశరథరామా!** [8-1]

మహా భాగవతం అష్టమ స్కందంలోని గజేంద్ర మోక్షం గురించి తెలియని తెలుగు వాళ్ళుండరు. తెలుగులో పోతన రాసినది మూలానికంటే చాలా పెద్దదని అంటున్నారు ఎందుకంటే పోతన శ్రీధర భాగవతాన్ని కూడా తెనిగించాడుట. కరి మకరుల సంగ్రామంలో భగవంతుడు పశుపక్ష్యాదులతో సహా ఎవరి ఆలాపన అయినా వింటాడనీ, ఎటొచ్చీ ఆ ఆలాపన మనసుతో పెట్టి చెయ్యాలనీ నిఘూడంగా చెప్తోంది భాగవతం. ద్రౌపదికి నిండు సభలో వస్త్రాపహరణం జరుగుతూంటే అతిరథ మహారథులైన ఐదుగురు భర్తలూ చేతకాని వాళ్ళైనప్పుడు 'హే ద్వారకావాసా' అని పిల్చిందిట ద్రౌపది. తర్వాత కథ మనకి తెల్సిందే. తర్వాతెప్పుడో ద్రౌపది అడిగిందిట కృష్ణుణ్ణి "నేను అంత ఆర్తిగా పిల్చినా ఎందుకంత ఆలశ్యంగా వచ్చావు?" అని. "అమ్మా నువ్వు నన్ను ద్వారకావాసా అని పిల్చేవు గుర్తుందా? అక్కడ్నుంచి పరిగెట్టుకు రావడానికి సమయం పట్టదూ? నేను నీ హృదయంలోనే నీ ముక్కుకన్నా దగ్గర్లో ఉన్నానని మర్చిపోయేవు. నీదే తప్పు మరి" అన్నాట్ట పరంధాముడు నవ్వుతూ. దీని గురించి మళ్ళీ చివర్లో చూద్దాం.

ఇంద్రద్యుమ్నుడనే రాజు. అత్యంత విష్ణు భక్తుడు. ఓ రోజు భగవంతుడ్ని ధ్యానం చేస్తూ కళ్ళుమూసుకుని ఉన్నాడు. అప్పుడు అగస్త్యుల వారు అక్కడకొచ్చేరు. కానీ మహారాజు ధ్యానంలో ఉండడం వల్ల ఆయన రాకని గమనించలేదు. కోపం వచ్చి ఆయన శపించేడు, ఏనుగు జన్మ ఎత్తూ అని. ఈ రాజు గారు కూడా తపస్సంపన్నుడే, శపించగలడు. కానీ అలా చేయకుండా భగవంతుడ్నే నమ్ముకుని ఉన్నాడు. శాప ప్రకారం ఏనుగు జన్మ ఎత్తి మొసలిచేత పట్టుబడ్డాడు. ఆ మొసలి కూడ శాపం మూలాన అలా జన్మ ఎత్తిందే. వీళ్ళిద్దరూ ఒక కొలనులో కల్సుకోవడం అదంతా కర్మ కి సంబంధించిన విషయం.

మనకీ ఇలాంటివి రోజూ జరుగుతూ ఉంటాయి. మనకి ఎవరితోనో పనిచేయడం ఇష్టం ఉండదు. కానీ ఆఫీసుకెళ్ళే సరికి ఓ రోజు "ఫలానా నీకిష్టంలేని వాడూ, నువ్వూ కల్సి ఈ ప్రాజక్ట్ మీద పనిచేయండి" అని మీ మేనేజర్ తాఖీదు చేశాడు. చచ్చినట్టూ చెయ్యాలి; చేస్తారు కూడాను. అలాగే ఓ రోజున ఎక్కడికో వెళ్దామని బయల్దేరుతారు. రోడ్లు బాగు చేస్తున్నారని ట్రాఫిక్ మళ్ళించేరు. అప్పుడే బండిలో పెట్రోల్ అయిపోయింది అని డేష్ బోర్డ్ మీద లైట్ వెలిగింది. ఎప్పుడూ చూడని ఏదో ఊర్లో దిగి అక్కడ గేస్ కొట్టించుకుని ఆకలి తీర్చుకోవడానికి ఏదో తిన్నారు. వెనక్కి కారు దగ్గిరకి వస్తూంటే చూసుకోకుండా అక్కడున్న చిన్న గుంటలో పడి కాలు విరిగింది. ఐదారు వారాలు కట్టు ఉంచుకుని మళ్ళీ గాడిలో పడ్డారు. ఇంటికొచ్చేక ఇవన్నీ తల్చుకుంటే, ఇదేమిటి నేను అటువేపు ఎందుకెళ్ళాను? వెళ్ళాననుకో, అక్కడ గుంట ఎందుకు చూసుకోలేదు? ఇత్యాది ప్రశ్నలు. కర్మ ఫలితం ఇలాగే ఉంటుంది. మీరు హాస్పిటల్ కీ, డాక్టర్లకీ డబ్బులు బాకీ, అక్కడ గేస్ స్టేషన్ కి డబ్బులు బాకీ. అవన్నీ తీర్చుకోవడానికి ట్రాఫిక్ డైవర్షన్ సహకరించింది. అందుచేతే 'కారణం లేక కార్యం లేదు.'

మనం ఎప్పుడు ఎక్కడ ఎవర్ని ఏ సమయానికి ఎందుకు కల్సుకుంటామో ఎవరికీ తెలియదు. అలా నేను కలుసుకోను అనడం కదరదు కూడానూ. అందుకే కరి తన గుంపు నుంచి విడిపోయి రావాల్సిన సమయానికి తనకి ముక్తికి కారణమైన మకరిని కల్సుకోవడానికి బయల్దేరింది.

**మ. అటఁ గాంచెం గరిణీవిభుండు నవఫుల్లాంభోజకల్హారమున్**
**నటదిందిందిర వారముం గమఠ మీన గ్రాహ దుర్వారమున్**
**వట హింతాల రసాల సాల సుమనో వల్లీకుటీతీరముం**
**జటులోద్ధూత మరాళ చక్ర బక సంచారంబుఁ గాసారమున్** [8-42]

అలా తిరిగి తిరిగి ఈ మడుగుని చూసాడు మన కరి. ఇందులో తాబేళ్ళు, మొసళ్ళు కూడా ఉన్నాయని చెప్తున్నాడు (గమఠ మీన గ్రాహ దుర్వారమున్). అయినా సరే అందులోకే దిగుతున్నాడు. అన్నింటికీ రంగం సిద్ధమైంది. అప్పుడు మొసలి వచ్చి పట్టుకున్నాడు.

**సీ. భుగభుగాయితభూరి బుద్బుదచ్ఛటలతోఁ**
**గదలుచు దివికి భంగంబు లెగయ;**
**భువన భయంకరఫూత్కార రవమున**

**ఘోరనక్రగ్రాహకోటి బెగడ;**

**వాలవిక్షేప దుర్వార ఝుంఝూనిల**

**వశమున ఘుమఘుమావర్త మడరఁ;**

**గల్లోలజాల సంఘట్టనంబులఁ దటీ**

**తరులమూలంబులై ధరణిఁ గూల** [8-51]

**తే. సరసిలోనుండి పొడగని సంభ్రమించి**

**యుదరి కుప్పించి లంఘించి హుంకరించి**

**భానుఁ గబళించి పట్టు స్వర్భానుపగిది**

**నొక్క మకరేంద్రుఁ డిభరాజు నొడిసిపట్టె.** [8-51.1]

సరస్సులోంచి చూసి కోపంతో రాహువు సూరుణ్ణి పట్టుకున్నట్టూ పట్టేడుట కరిని. అన్ని రకాల దుర్ముహుర్తాలు కనబడుతున్నాయి మొసలి ఏనుగు కాలు పట్టేసరికి. ఇవి దుర్ముహుర్తాలేనా? దీనికి సమాధానం మనం అర్థం చేసుకునేదాన్ని బట్టి ఉంటుంది.

అందుచేత ఈ దుర్ముహుర్తాలన్నీ కరికి మంచిచేసేవే, కానీ భగవత్ సాయుజ్యం పొందడానికి అవి జరిగితీరాలి. భారత దేశం ఎటుపోతోందో తెలియని రోజుల్లో హిందూమతం ఉనికి ఉంటుందా పోతుందా అనిపించే రోజుల్లో దాన్ని ఒంటి చేత్తో సగర్వంగా నించోపెట్టిన స్వామి వివేకానంద చాలా రోజులు తిండిలేక, సరైన బట్టల్లేక గర్భ దరిద్రంలో అల్లల్లాడేరు. అయితే ఆయనికి సంభవించిన కష్టాలు ఆయనికి రావాల్సినవేనా అని అడిగితే? ఆ కష్టాలు వజ్రాన్ని సానబట్టే ఆకురాళ్ళు. ఒక్కసారి సానబెట్టడం ఐపోగానే వజ్రం ధగా ధగా మెరవడం ప్రారంభమౌతుంది. అందుచేత ప్రపంచం లో దుర్ముహుర్తం అనేదేమీ లేదు. అన్నీ మంచివే. కానీ అవి జరిగినప్పుడు మాత్రం మనస్సు అతలాకుతలం అవుతుంది.

**చ. పదములఁ బట్టినం దలకుబా టొకయింతయు లేక శూరతన్**

**మదగజవల్లభుండు ధృతిమంతుఁడు దంతయుగాంత ఘట్టనం**

**జెదరఁగఁ జిమ్మె న మ్మకరిచిప్పలు పాదులు దప్పనొప్పఁ అన్**

**వదలి జలగ్రహంబు కరివాలముమూలముఁ జీరెఁ గోరులన్.** [8-53]

మొసలి అలా పట్టేసుకోగానే మన గజం ఊరుకోలేదు. మొసలి చర్మంమీద ఉండే పొలుసులు వదులైపోయేటట్టూ కొట్టింది. మొసలి తక్కువ తిందా? అది మళ్ళీ మీదకొచ్చి తోక ఉండే పృష్టభాగం చీరేసింది గోళ్ళతోటి. ఇప్పుడు పోతన తెలుగు పదాల్ని ఎలా ఆడుకున్నాడో చూడండి.

క. కరిఁ దిగుచు మకరి సరసికిఁ
గరి దరికిని మకరిఁ దిగుచు గరకరి బెరయన్
గరికి మకరి మకరికిఁ గరి
భర మనుచును నతల కుతల భటు లరుదు పడన్. [8-54]

కరికి మకరీ, మకరికి కరీ సరైన ఉజ్జీలే. ఒకటి ఒడ్డుమీదకి లాగుతూంటే, ఒకటి సరస్సులోకి లాగుతోంది. ఈ యుద్ధంచూసి అతలలోక కుతలోక వీరులు ఆశ్చర్యపోతున్నారు.

ఇప్పుడు పోతన గారి వచనం చూద్దాం. అర్ధం మాట అటుంచి ఒకసారి మొత్తం అంతా తడుముకోకుండా చదవడానికి ప్రయత్నం చేయండి. అవును ఇది తెలుగే. ఉషశ్రీ మాటల్లో ఇది పోతన వచన కవిత్వం కాదు కవిత్వ వచనం. ఇటువంటి సందర్భాలలో పోతన తన సహజ పాండిత్యంలో విశ్వరూపం చూపించేడు. ఇలాంటివే గంగావతరణం, నృసింహావతారావిర్భావం, నైమిశారణ్య వర్ణన, వామనావతారం కూడా. అవి పోతన మూల భాగవతంలో చదివితే తప్ప పోతన ఎంతటి వాడో మనకి అర్ధంకాదు. కవి ఎంతటివాడైనా, నా ఉద్దేశ్యంలో ఇటువంటివి అలవోకగా రాయడం - భగవత్కృప లేకుండా అసంభవం.

వ. ఇట్లు కరిమకరంబులు రెండును నొండొండ సముద్దండదండంబులై తలపడి నిఖిల లోకాలోకన భీకరంబులై; యన్యోన్య విజయశ్రీ వశీకరంబులై; సంక్షోభిత కమలాకరంబులై; హరి హరియును; గిరి గిరియునుం దాఁకి పెఱుతివియక పెనంగు తెఱంగున నీరాటం బయిన పోరాటం బునం బట్టుచు వెలికి లోనికిం దిగుచుచుఁ గొలంకు గలంకంబొందఁ గడువడి నిట్టట్టుఁబడి తడఁబడక బుడబుడానుకారంబులై బుగులు బుగు ల్లను చప్పుళ్ళతో నురువులుఁ గట్టుచు జలంబు లుప్పరం బెగయం జప్పరించుచుఁ దప్పక వదనగహ్వరంబుల నప్పళించుచు నిశితనితాంత దురంతదంత కుంతలంబుల నింతింతలు తునియలయి నెప్పళంబునం బునుక చిప్పలుఁ గుదుళ్ళుఁ దప్పి రక్తంబులుఁ గ్రమ్ముదేర హుమ్మని యొక్కుమ్మడిం జిమ్ముచు నితరేతర సమా కర్షణంబులం గదలక పదంబుల మొదలిపట్టు వదలక కుదురై వర్తించుచు బరిభ్రమణ వేగంబున జలంబులం దిరుగుచు మకర కమఠ కర్కట గండక మండూకాది సలిల నిలయంబుల ప్రాణంబులు క్షీణంబులుగా నొండొంటిం దాఁకు రభసంబున నిక్కలుబడ మ్రక్కం ద్రొక్కుచు మెండుచెడి బెండుపడి నాఁచు గుల్లచిప్ప తండంబులఁ బరస్పర తాడనంబులకు నడ్డంబుగా నొడ్డుచు నోలమాసగొనక గెలుపు దలంపులు బెట్టిదంబులై రెట్టింప నహోరాత్రంబులుం బోలెఁ గ్రమక్రమ విజృంభమాణంబులై బహుకాల కలహ విహారంబులయి నిర్గత నిద్రాహారంబులై యవక్రపరాక్రమ ఘోరంబులై పోరుచున్న సమయంబున. [8-55]

హరి అంటే అనేకానేక అర్ధాలున్నాయి. అందులో సింహం అనేది ఒకటి. పోతన సింహం అనే మాటకి హరి అని అనేక చోట్ల రాసాడు భాగవతంలో. ఆఖరికి ఈ వచనంలో కూడా. సింహం సింహంతో, కొండ ఇంకో కొండతో పోరుతూంటే ఎలా ఉంటుందో అలా ఉందిట ఈ కరి మకరుల సంగ్రామం. గెలవాలనే కోరికతో అహోరాత్రాలూ నిద్రాహారాలు మానేసి పోరాడుతున్నాయి. ఇప్పటిదాకా

మన కరికి తాను ఇంతవాడిని, అది చెయ్యగలను ఇది చెయ్యగలను అనే ఆలోచనలు. ఈ మొసలొక లెక్కా, నేను విడిపించుకోగల్నా అనే. అటువేపు మొసలి కూడా అలాగే ఉంది. అంచేత సంగ్రామం జరుగుతూనే ఉంది. ఇందులో కరి మనమే. మకరి ఈ ప్రపంచం. నేను ఇందులోంచి తప్పించుకోగలనూ అనుకుంటూ ఉన్నంతకాలం అది మనల్ని అలా లోపలకి లాగుతూనే ఉంటుంది.

**మ. ఉఱుకుం గుంభయుగంబుపై హరి క్రియన్ హుమ్మంచుఁ; బాదంబులం**
**నెఱయం గంతము వెన్నుదన్ను; నెగయు న్హేలాగతిన్; వాలముం**
**జఱచుం నుగ్గఁగఁదాఁకు ముంచు మునుగుం శల్యంబులుందంతముల్**
**విఱుఁగన్ వ్రేయుచుఁ బొంచిపొంచి కదియున్ వేదండ యూథోత్తమున్** [8-62]

కాసేపు పట్టు వదిలేసి చూస్తే ఏనుగు వెళ్ళిపోతుంది బయటకి. అప్పుడు సింహంలాగా (మళ్ళీ సింహాన్నీ హరి అన్నాడు ఇక్కడ పోతన) హూంమని పైకెరిగి కొడుతోంది. తోకపీకుతోంది. తను మునుగుతుంది, ఏనుగుని ముంచుతోందికూడా. ఎలా వదిలించుకుందామన్నా పొంచి పొంచి కొడుతోంది. భలేవారే మొసలి ఏనుగు కుంభస్థలం మీదకి ఎలా ఎగుర్తుంది అంటున్నారా? అయితే ఏనుగు ఒడ్డు మీద ఉండి కాలుమాత్రం నీట్లో పెడితే మొసలి పట్టుకుంది అనే ఆలోచన వదుల్చుకోవాలి. ఏనుగు సరస్సులోపల పూర్తిగా మునిగేదాకా వెళ్ళింది.

మొసలి వైపు నుంచి ఒకసారి చూద్దాం ఏనుగు మీద జాలి ఒక పక్కన పెట్టి. మొసలి నీటిలోంచి బయటకి వస్తే కుక్కలు కూడా చంపగలవు కానీ నీళ్ళలో దానికి బలం పెరుగుతుంది అని చెప్తూ ఉంటారు. అలాంటి మొసలికి ఏనుగు ఆహారంగా వచ్చింది. ఇది చాలా రోజులకి సరిపడా ఆహారం. అంటే మొసలికి లాటరీ తగిలినట్టే. తినకుండా ఎందుకు వదిలిపెట్టాలి? ఈ తినడంలో ఏనుగు గాయపడి ఏడిస్తే అది మొసలికి అనవసరం. నా కంచంలో ఆహారాన్ని నేను నా ఇష్టం వచ్చినంతకాలం ఆస్వాదిస్తాను. వద్దనడానికి ఎవరికుంది అధికారం? ఈ ఆహారం తినడంలో కూడా అనేకానేక పద్ధతులున్నాయి. ఇప్పుడు కొంచెం, మిగిలిపోయింది దాచుకుని కొంచెం, అలా అలా తినొచ్చు. తినేటప్పుడు మొహంలో అలౌకికానందం చూపించడం మరో పద్ధతి.

ఆ అలౌకికానందం, యోగులు బ్రహ్మపదాన్ని చేరితే ఎలా ఉంటారో అలా ఉండొచ్చు. లేకపోతే సాదా సీదాగా ఉండొచ్చు. కానీ ఇక్కడ మొసలికి తగిలింది పేద్ద లాటరీ. మిలియన్ డాలర్ల లాటరీ. అది ఊరికే పోనిస్తుందా? అటువంటప్పుడు అత్యంత వైభవం కనిపిస్తూంది దాని మొహంలోనూ, అది చేసే పనుల్లోనూ.

**శా. పాదద్వంద్వము నేలమోపి పవనున్ బంధించి పంచేంద్రియో**
**న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ మాఱాకు హత్తించి ని**
**ష్ఖేదబ్రహ్మపదావలంబనరతిం గ్రీడించు యోగీంద్రు మ**
**ర్యాదన్ నక్రము విక్రమించెఁ గరిపాదాక్రాంతనిర్వక్రమై** [8-65]

అప్పుడు కాళ్ళు నేలమీద పెట్టి పంచేద్రియాలు బంధించి మనస్సునీ బుద్ధినీ బ్రహ్మం మిద పూర్తిగా ధ్యానం చేసే యోగిలాగా మొసలి ఏనుగు కాళ్ళు పట్టుకుని ఉంది. అంటే దానికి దొరికిన లాటరీని వదిలిపెట్టదానికి ఎటువంటి పరిస్థితుల్లోనూ సిద్ధంగా లేదు.

**క. అలయక సొలయక వేసట**
**నొలయకఁ గరి మకరితోడ నుద్దండత రా**
**త్రులు సంధ్యలు దివసంబులు**
**సలిపెం బో రొక్క వేయి సంవత్సరముల్** [8-69]

ఈ విధంగా అలుపూ సొలుపూ లేకుండా యుద్ధం జరుగుతూనే ఉంది. ఎన్నాళ్ల వరకూ? వేయి సంవత్సరాల వరకూ - పగలూ రాత్రీ అని లేకుండా.

విస్తరణ భీతి చేత ఇక్కడ ఆపి రెండు విషయాలు చూద్దాం. ఒకటి - పోతన సింహాన్ని హరి అని ఎందుకంటాడు అదే పనిగా? పోతనంతటి పండితుడు సింహానికి వేరే పదం ఉపయోగించలేడా? ఉపయోగించగలడు. ఉపయోగించి బ్రహ్మాండమైన పద్యం రాయగలడు కూడా ఎందుకంటే నండూరి వారు చెప్పినట్టూ పోతన కవితాకళ ప్రయోగించడంలో అక్షయ సమ్మోహనాస్త్ర తూణీరుడు.

శుకుడు పరీక్షిత్తుకి భాగవతం చెప్తున్నాడు, ఎందుకంటే ఒక్క వారంలో ఇది వినే పరీక్షిత్తు చావడానికి సిద్ధమై ఉండాలి. ఈ కరి మకరుల సంగ్రామ కథ వింటూ అసలు విషయం మర్చిపోకుండా ఉండడానికి 'హరి ' 'హరి ' అని జ్ఞాపకం చేస్తున్నాడు కవి. మరోవిధంగా చెప్పాలంటే, భాగవతం చదివే మనకి కూడా ఇది వర్తిస్తుంది. ఏమో ఎవరు ఎప్పుడు పోతారో ఎవరు చెప్పగలరు? అందుచేత భాగవతం చదువుతుంటే ఇలాంటి రసవత్తరమైన కథలో పడి అసలు కథానాయకుడిని మర్చిపోకుండా ఉండడానికే హరి అని ప్రయోగించేడు సింహానికి బదులు.

రెండోది - కరి మకరులు రెండూ మహా అయితే ఓ వందేళ్ళు బతకొచ్చు. వెయ్యేళ్ళు సంగ్రామం ఎలా జరుగుతుంది? ఇందులో కరి మనమే. మకరి ఈ ప్రపంచం. ఎంత వదిలించుకుందామన్నా అందులోకి కూరుకుపోవటమే తప్ప బయటకు సొంత ప్రయత్నంతో రావడం అసంభవం. ఎంతకాలం ఇలా? కోటి జన్మలు పట్టొచ్చు. లేకపోతే రేపే ఆత్మ సాక్షాత్కారం అవ్వొచ్చు. అయితే భగవత్కృప ఉంటే? దానితో వెంటనే బయటకి రావొచ్చు. ఎంత త్వరగా బయటకి రావొచ్చనేది మనమీదే, మనం ఎంత త్వరగా శరణాగతి సంపాదిస్తామో దానిమీదే ఆధారపడి ఉంది.

మొదట్లో ద్రౌపది కథ మళ్ళీ ఓ సారి చూద్దాం. ప్రాతికామి లోపలకి వెళ్ళి 'అమ్మా, మిమ్మల్ని రాజుగారు జూదంలో ఓడిపోయేరు అందుచేత మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు' అన్నప్పుడు గానీ, సభలోకి వచ్చాక తన ఐదుగురు భర్తలూ మొహాలు వేళ్ళాడేసినప్పుడు కానీ ద్రౌపది కృష్ణుణ్ణి తల్చుకుందా? ఆయన చూస్తూ ఉన్నాడు పిలిస్తే పలకడానికి. దుశ్శాసనుడు చీర లాగడం మొదలు పెట్టేసరికి అప్పుడు అవగతం అయింది ఆవిడకి - తనకున్న అతిరథ మహారథులైన భర్తలు ఇప్పుడు ఎందుకూ చేతకారని. అప్పుడు గుర్తుకొచ్చేడు కృష్ణుడు. అయితే 'ద్వారకావాసా' అంది కనక కాస్త ఆలస్యమైనా ఆయన పరిగెట్టుకొచ్చేడు. అలాగే కరి (అంటే రోజూ ఈ

ప్రపంచంలో అనేకానేక కష్టాలు అనుభవించే మనమే) భగవంతుడ్ని తల్చుకోనంతవరకూ ఆయన అలా చూస్తూ ఉంటాడు. ఒక్కసారి మనం పిలిస్తే పరిగెట్టుకుని వస్తాడు. ఇది అర్థం అవడానికే ఆ రెండూ వెయ్యేళ్ళు అలా పోరాటం సాగించాయి అని చెప్తున్నాడు. ఈ వెయ్యేళ్ళ లో ఎన్ని జన్మలెత్తుతామో ఎవరికెరుక?

ఇప్పుడు కరి మకరులు పోరాటాం సాగిస్తున్నాయి. ఇంత కష్టపడినా, అంత బలం ఉన్నా ఏనుగు రాలేకపోతోంది బయటకి. అప్పుడు "నేను ఏదైనా చేయగలను" అనే అహంకారంలోంచి బయటపడి పరమేశ్వరా "నువ్వే ఏదన్నా చేయగలవు" అనే శరణాగతి మనసులోకి రాగానే ఆయన పరిగెట్టుకూంటూ వస్తాడు. ఎంత తొందరగా వస్తాడూ అనేది మన శరణాగతి ఎంత లోతుగా ఉంది అనేదానిమీద ఆధారపడి ఉంటుంది.

రాబోయే వ్యాసంలో చక్రి ఎంత తొందరగా పరిగెట్టుకొచ్చాడో చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS